MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 275 | గురువారం 24 జూలై 2025 | పేజీలు : 4 | వెల : 3/-








# రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**తద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు**

**కొత్తగా రాష్ట్ర నూర్ బాషా/దూదేకుల ఆర్థిక సంస్థ ఏర్పాటు**

**విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు టెండర్ల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్**

**మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**(అంకుశం, అమరావతి, జులై 24):**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రూ. 80 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. తద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. భవిష్యత్తులో పెట్టుబడిదారులు అందరికీ అంతిమ గమ్యస్థానం ఆంధ్రప్రదేశ్ అయ్యే విధంగా విదానాలు తీసుకురావడం, అందుకు అనుగుణంగా వచ్చిన పెట్టుబడులకు ప్రతిపాదనలకు ఆమోద ముద్రవేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ ఆమోదం కొరకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ విధానం వ్యాపార వేగాన్ని పెంచడంతో పాటు దేశీయ మరియు ప్రపంచ స్థాయిలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఎలక్ట్రానిక్స్ భాగాల పర్యావరణ వ్యవస్థని ఉత్తేజపరచనుంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి పెట్టే ఎలక్ట్రానిక్ భాగాల తయారీ కంపెనీలు ముందస్తు ప్రోత్సాహకాలు, మ్యాచింగ్ ప్రోత్సాహకాలు, మధ్యంతర మద్దతు చర్యలు మరియు ప్రత్యేక క్లస్టర్‌లలో ప్లగ్%-%అండ్%-%ప్లే తయారీ సౌకర్యాలను పొందవచ్చు. మెగా ప్రాజెక్టులకు అనుకూలంగా ప్రోత్సాహకాలు మరియు రాయితీలను కూడా



కంపెనీలు పొందవచ్చు. తిరుపతి సమీపంలోని శ్రీ సిటీ, కర్నూలు సమీపంలోని ఓర్వకల్, కొప్పర్తి మరియు హిందూపూర్ వంటి ప్రాంతాల్లో గణనీయంగా ఉద్యోగ కల్పనకు అవకాశం ఏర్పడ నుంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిపార్సు మేరకు విశాఖపట్నం జిల్లా మధురవాడ ఐటీ హిల్ నం.3 పై 3.6 ఎకరాల భూమిని ఎకరం రూ.1 కోటి చొప్పున మరియు - మిగతా2లో

## బీసీ హాస్టళ్లలో క్రీడలకు ప్రోత్సాహం

**(అంకుశం, అమరావతి, జులై 24):**



క్రీడల్లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు రాణించేలా ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హాస్టళ్లలో క్రీడా వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ హాస్టళ్లలో క్రీడా వసతుల కల్పనపై ఇరువురు చర్చించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులకు, ఇంటికి దూరంగా ఉండే విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపశమనం కలిగిస్తూ మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు. అదే సమయంలో క్రీడల్లో సత్తా చాటే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో, బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇప్పటికే స్పోర్ట్స్ కిట్లు విరివిగా అందజేస్తూ, మండల, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎందరో విద్యార్థులు పలు క్రీడల్లో సత్తా చాటుతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. బీసీ హాస్టళ్ల విద్యార్థులకు శాప్ కూడా సహకారమందిస్తే, దేశం గర్వించే క్రీడాకారులను అందించే అవకాశం కలుగుతుందన్నారు. ఇండోర్, అవుట్ డోర్ స్పోర్ట్స్ కిట్లు అందజేయాలన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, క్రీడల్లో రాణించే బీసీ హాస్టల్ విద్యార్థులకు శాప్ తరపున అండగా నిలుస్తామన్నారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లల్లో క్రీడల అభివద్ధికి తమవంతు సాయమందిస్తామన్నారు. అంతకుముందు మంత్రి సవితను శాప్ చైర్మన్ రవినాయుడు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, ఎంజేపీ స్కూల్స్ కార్యదర్శి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## పవన్, లోకేష్ ఆత్మీయ పలకరింపు

(అంకుశం, అమరావతి, జులై 24): రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన క్యాబినెట్ భేటీకి ముందు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ ల ఆత్మీయ పలకరింపు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు.



# సెంచరీలతో చెలరేగిన ధనుష్, హేమంత్ రెడ్డి

**ఆంధ్ర సీనియర్స్ పోటీలలో డి, సి జట్లు గెలుపు**

**రాణించిన మహిప్ కుమార్, మునిష్ వర్మ, జ్ఞానేశ్వర్, అభినవ్, ధీరజ్, మనాస్, గిరినాథ్ రెడ్డి, రవికిరణ్, అంజినేయులు, సిద్ధార్థ**






## చంద్రన్న పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమం

- ఎన్.ఎస్.గేటులో జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో పరిటాల సునీత
- నాలుగేళ్లలో ఇంకా చేయాల్సింది చాలా ఉందన్న ఎమ్మెల్యే సునీత





**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 24:** రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా అందరికీ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతున్నదని ఏడాది కాలంలో తాము చేసిన అభివృద్ధి గురించి ప్రజలే చెబుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గేట్ సమీపంలోని కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో – తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గత ప్రభుత్వ పాలన ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందన్నది కూడా తెలుసుకున్నారు. తల్లికి వందనం, పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటివి అందాయా లేదా అని ఆరా తీశారు. ఇందులో చాలా మంది తమకు అన్ని పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కాలనీ వాసులు కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్న సంతోషం కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకం బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి 13వేల చొప్పున అందిందన్నారు. ఆగష్టు మొదటి వారంలో అన్నదాత సుఖీభవ, ఆగష్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాలన్నీ అమలు చేస్తున్నారన్నారు. అందునా పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తాము చేసిన అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## ఉత్తమ గ్రామ పంచాయతీగా జాతీయ స్థాయిలో గొట్లూరు ఎంపిక.పలువురి హర్షం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** నియోజకవర్గంలోని ధర్మవరం మండల పరిధిలోని గొట్లూరు గ్రామ పంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా కేంద్ర ప్రభుత్వం అధికార పూర్వకంగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో గొట్లూరు గ్రామానికి చోటు దక్కడం అభినందించేదగ్గ విషయమని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేయగా అందులో ఈ గ్రామం ఉండడం గొప్ప విశేషమని అధికారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15వ తేదీన ఎర్రకోట లో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరుకావాలని సర్పంచ్ పిట్ట నరసింహకు ఆహ్వానం అందడం జరిగిందని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. ఈ గ్రామంలో ఇంటింటికి తాగునీరు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా, చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యం అధికంగా ఉండడంతో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ ప్రజలు పిట్టా నరసమ్మను అభినందించడం జరిగింది.

## వృద్ధులకు అన్నదానం చేసిన మహాలక్ష్మి జూవెలర్స్ కుటుంబ సభ్యులు



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** ధర్మవరం మెయిన్ బజారు కు చెందిన మహాలక్ష్మి జూవెలర్స్ అధినేత వజ్జల వెంకటేష్, శ్రీ మతి అనూష, చిన్నారి శ్రీ నిఖ కుటుంబ సభ్యులు ఆషాడం బహుళ అమావాస్య సందర్భంగా ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో వృద్దులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో ఇంకా శ్రీ మతి ప్రమీల, వేణుగోపాల్ వజ్జల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గౌరవానికి ఆహ్వానం

## - గొట్లూరు గ్రామానికి గర్వకారణం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** ఈ ఏడాది స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరగనున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ముగ్గురు సర్పంచులకు పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. అందులో ఒకరుగా ధర్మవరం నియోజకవర్గంకు చెందిన గొట్లూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి పిట్టా నరసమ్మ గారు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ గారు నేరుగా శ్రీమతి నరసమ్మ గారితో ఫోన్ ద్వారా మాట్లాడి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి గారి నియోజకవర్గ ఇన్?చార్జ్ హరీష్ బాబు గారు మరియు రూరల్ మండల అధ్యక్షుడు శ్రీ గొట్లూరు చంద్ర గారు శ్రీమతి పిట్టా నరసమ్మ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇది ధర్మవరం ప్రజల సమిష్టి అభివృద్ధికి ప్రతిబింబం. గ్రామస్థాయి నాయకత్వం జాతీయ వేదికపై మెరుస్తుండడం నిజంగా అభినందనీయం!

# అహుడా పనులను వేగవంతం చేయాలి

## – జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ





**అంకుశం న్యూస్ అనంతపురం, జులై 24:** అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను సత్వరమే వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ ఆదేశించారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టి.సి. వరుణ్‌తో కలిసి అహుడా పని తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎం.ఐ.జి లేఅవుట్ల భూముల సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణం అనంతరం ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందించగలిగే భూములను గుర్తించాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పెనుగొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కోడూరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, ఇంజనీరింగ్ పనులు, ప్రభుత్వ – ప్రైవేటు భూసేకరణలపై ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులద్వారా వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్లాట్ల కేటాయింపులో పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగర కేంద్రాలకు దగ్గరగా ఉన్న అభివృద్ధి చేయదగిన నాణ్యమైన భూములపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ, ఇతర ప్రాథమిక సదుపాయాలతో కూడిన ప్లాన్లను సిద్ధం చేసుకోవాలని ఇన్చార్జి కలెక్టర్ సూచించారు. పనులను పూర్తి చేయడంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ అధికారులకు తెలిపారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జె.పి.ఓ హరీష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకోసం

# పరిటాల శ్రీరామ్ సరికొత్త ప్రయత్నం

- మీ సమస్య–మా బాధ్యత అనే కార్యక్రమానికి శ్రీకారం
- నేటి నుంచి పట్టణంలో సచివాలయాల పరిధిలో గ్రీవెన్స్
- ఆ రోజు ఓట్లు అడిగాం–ఈరోజు వారి సమస్యలు తీర్చే బాధ్యత మాదే
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీరామ్ విజ్ఞప్తి



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 24:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తైన సందర్భంగా సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమం ధర్మవరం నియోజకవర్గంలో విజయవంతంగా సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో ధర్మవరం అగ్ర స్థానంలో ఉంది. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పలు రకాల సమస్యలు శ్రీరామ్ తో పాటు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వీటి పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించాలని శ్రీరామ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్, విద్యుత్ తో పాటు పలు విభాగాల అధికారులను కూడా భాగస్వామ్యం చేయనున్నట్టు చెప్పారు. మొదట ధర్మవరం నియోజరవర్గంలో ప్రతి రోజు నాలుగు సచివాలయాల పరిధిలో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. అన్ని చోట్ల శ్రీరామ్ స్వయంగా పాల్గొనబోతున్నారు. ముందుగా శుక్రవారం రోజు 7, 8వ వార్డులలో ప్రారంభించనున్నారు. పట్టణంలోని శివానగర్ లో ఉన్న శివాలయంలో శ్రీరామ్ ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఏడు కొళాయిల పార్కు వద్ద ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ధర్మవరం పట్టణంతో పాటు మిగిలిన నాలుగు మండలాల్లో కూడా నిర్వహించబోతున్నారు. ఇందుకు సంబంధించి రూరల్ మండల నాయకులతో శ్రీరామ్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆ రోజు మనం ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడిగామని.. ఈ రోజు ప్రజల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని ఈ సందర్భంగా నాయకులకు సూచించారు. మన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను కూడా మనం పట్టించుకోకపోతే ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు. మనం ఏ సచివాలయం పరిధిలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నది ముందే ఆటోల ద్వారా చాటింపులు వేయించి.. వీలైనంత ఎక్కువ మంది నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు పక్కన పెట్టి.. మన నియోజకవర్గంలో మనం ఎంత వరకు వీరి సమస్యలు తీర్చగలమన్నది చూడాలన్నారు. ఇది ప్రజలకు, మనకు మధ్య బంధాన్ని మరింత పెంచుతుందని శ్రీరామ్ అన్నారు. ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఇందులో భాగస్వామ్యులు కావాలని.. ప్రజల సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజలు కూడా దీనిని సద్వినియోగం చేసుకుని.. మీ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

## 'తల్లికి వందనం'పై ఆందోళన వద్దు

- త్వరలోనే మిగిలిన సొమ్ము జమ




**(అంకుశం, అమరావతి, జూలై 24):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న షెడ్యూల్డ్ కుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తల్లికి వందనం పథకం సొమ్ము జమ కాకపోవడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 9,10 తరగతులు, ఇంటర్మీడియట్ 1,2 సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నారు. తల్లికి వందనం పథకంలో వీరికి సంబంధించి కొంత వాటాను కేంద్రం భరిస్తుంది. ఆ సొమ్ము బ్యాంక్ లింకేజి అయిన విద్యార్థులు, తల్లి దండ్రుల అకౌంట్ లో మరో 20 రోజుల్లో జమ అవుతుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వారికి ఆర్థిక వెసలుబాటు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ కేటగిరీలోని విద్యార్థులకు తమ వాటా నిధులు రూ.382.66 కోట్లు జమ చేసింది. ఈ కారణంగా 9, 10 తరగతులు చదివే ఎస్సీ డే%–%స్కాలర్ విద్యార్థులకు సంబంధించి వారి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.10,900, హాస్టల్ విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు రూ.8,800 చొప్పున జమ చేయడం జరిగింది. అదేవిధంగా ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు రూ.5,200 నుండి రూ.10,972 వరకు నేరుగా విద్యార్థుల సొంత బ్యాంకు ఖాతాలకు జమ చేయబడింది. రాష్ట్రప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ప్రకటించిన విధంగా మిగిలిన సొమ్ము కేంద్ర ప్రభుత్వం రాబోయే 20 రోజుల్లోపు తల్లులు/విద్యార్థుల ఆధార్- లింక్డ్ బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తుంది. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## కాటన్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు నదుల అనుసంధానం

–ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**(అంకుశం, అమరావతి, జూలై 24):** కాటన్ మహాశయుడి స్ఫూర్తితో సీఎం చంద్రబాబు నాయుడు గోదావరి వరద జలాలు వృధాగా సముద్రంలోకి పోకుండా పోలవరం –బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో గురువారం సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఆనాడు ఆంగ్లేయుడైన ఆర్థర్ కాటన్ ముందు చూపుతో ధవళేశ్వరం ఆనకట్ట తో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో కాలువల నిర్మాణాలకు,కష్ణా ఆనకట్టకు కషి చేసిన మహానుభావుడు. గత జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టుతో పాటు ఇరిగేషన్ శాఖ విధ్వంశంతో కాటన్ దొర ఆత్మసైతం క్షోభిస్తోంది. ృవిధ్వంశానికి గురైన పోలవరం ప్రాజెక్టుతో పాటు, ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారు. నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పనిచేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు సాగు, త్రాగునీరు అందించనున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పంట కాలవలు, మురుగు డ్రైన్ల మెయింటినెన్స్ పనులకు రూ. 700 కోట్లను కేటాయించి సాగునీరు సక్రమంగా అందిస్తున్నాం అని పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ విషయంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు సాయం చేస్తున్నారు

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్
- 13మందికి రూ.5.80లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 24:** ప్రజలు కష్టాల్లో ఉన్నారంటే ముందుగా స్పందించే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమేనని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో పలువురికి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 13మందికి రూ.5.80 లక్షల రూపాయల చెక్కులను శ్రీరామ్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ వర్తించక అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు పొందిననట్టు వారు వివరించారు. ఆరోగ్యం విషయంలో ఇలా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి



విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా స్పందిస్తున్నారన్నారు. ఇప్పటికే ధర్మవరం నియోజకవర్గంలో ఎంతో మంది ఇలాంటి సాయం అందిందన్నారు. నియోజకవర్గ ప్రజల తరుపున శ్రీరామ్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు...

# దెందులూరులో ఆదరణ పనిముట్ల అమ్మకాలపై దర్యాప్తు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 24:** ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో ఆదరణ పనిముట్లు అమ్మకాలపై దర్యాప్తునకు ఆదేశించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దెందులూరులో ఎంజేపీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. దెందులూరు నియోజకవర్గం అప్పన్న వీడు కల్యాణమండపంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందన్నారు. జగన్ అసమర్థ పాలన కారణంగా రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడి పోయిందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఆదరణ పథకంలో పనిముట్లు లబ్ధిదారులకు అందజేయకుండా అమ్ముకోవడం దారుణమన్నారు. జగన్ తో సహా వైసీపీ నాయకులందరూ దోపిడీకి అలవాటు పడ్డారన్నారు. ఆదరణ పనిముట్ల అక్రమాలపై అధికారులు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వినతి మేరకు దెందులూరులో ఎంజేపీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆప్కాబ్ చైర్మన్ గన్నీ వీరాంజనేయులు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం.. షిరిడి సాయిబాబా సేవా సమితి.



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** పట్టణంలోని చేనేత కళాకారుడు, ప్రముఖ డిజైన్ కళాకారుడు జుజారు నాగరాజు జాతీయ అవార్డు ప్రకటించిన సందర్భంగా పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో జూజారు నాగరాజు దంపతులను శిరిడి సాయిబాబా సేవా సమితి కమిటీ వారు ఘనంగా సత్కరించారు. అనంతరం అధ్యక్షులు వీరనారాయణ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి కార్యదర్శి రామలింగయ్య ఉప కార్యదర్శి నాయుడు కోశాధికారి సూర్యనారాయణ , డైరెక్టర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ జూజారు నాగరాజు, జాతీయ అవార్డు పొందడం దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, ధర్మవరంకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను తేవడం ఎంతో శుభ సూచకమని తెలిపారు. మున్ముందు మరిన్ని అవార్డులు పొందాలని వారు తెలిపారు.

## శ్రీవారిపై అచంచలమైన భక్తిని చాటుకున్న భక్తుడు



**అంకుశం న్యూస్ తిరుమల జూలై 23:** మరణానంతరం వీలునామా ద్వారా టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహం, రూ.66 లక్షలు విరాళంహైదరాబాద్ కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ వై.వి.ఎస్.ఎస్. భాస్కర్ రావు తన మరణానంతరం వీలునామా ద్వారా టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహంతో పాటు తన బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న రూ.66 లక్షలను విరాళంగా అందించి అచంచలమైన భక్తిని చాటుకున్నారు.హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతంలో ఉన్న “ఆనంద నిలయం” అనే 3,500 చదరపు అడుగులు గల భవనాన్ని, ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఆయన టీటీడీకి విరాళంగా ఇస్తున్నట్లు వీలునామాలో పేర్కొన్నారు. తను బ్యాంకులో దాచుకున్న సొమ్మును టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.36 లక్షలు, శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవాణి ట్రస్టుకు రూ.6 లక్షలు విరాళంగా అందివ్వాలని సంకల్పించారు.తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో అంకితమై ఉండాలని ఆకాంక్షించిన భాస్కర్ రావు అంతిమ కోరిక మేరకు ఆయన మరణానంతరం ట్రస్టీలు ఎం.దేవరాజ్ రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్ లు వీలునామా ప్రకారం టీటీడీకి చెందాల్సిన ఆస్తి పత్రాలు, చెక్కులను గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్. వెంకయ్య చౌదరి అందజేశారు. ఈ మేరకు భాస్కర్ రావు గారి ట్రస్టీలను అదనపు ఈవో సత్కరించి ఈ సత్కార్యానికి కృషి చేసినందుకు గాను అభినందనలు తెలియజేశారు.

# గ్రామీణాభివృద్ధి పనులపై జాతీయ కేంద్ర బృందం పరిశీలన

- జాతీయ కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ సూచనలు
- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, జూలై 24:** గ్రామీణాభివృద్ధి పనులపై జాతీయ కేంద్ర బృందం ఎనిమిది రోజుల పాటు క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనుంది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను బృందానికి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం, మినీ కాన్ఫరెన్స్ హాలు నందు..కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్వహిస్తున్న గ్రామీణాభివృద్ధి పథకం అమలుపై జాతీయ కేంద్ర బృందం సభ్యులు దయాకర్ రెడ్డి, చూడామని రెడ్డి..లతో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ కేంద్ర బృందం సభ్యులు ఈ నెల 25 నుండి ఆగస్టు 1 వ తేదీ వరకు అమరాపురము, గాండ్లపెంట , రామగిరి మూడు మండలాల్లో 8 గ్రామ పంచాయితీల్లో జాతీయస్థాయి కేంద్ర బృందం పర్యటించి గ్రామీణాభివృద్ధి పనులను లబ్ది దారులతో సమావేశమై, ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఉపాధి హామీ పనులు, పెన్షన్ పంపిణీ, మహిళా సంఘాల పనితీరు, హౌసింగ్, వాటర్షెడ్, గ్రామ పంచాయతీ పనితీరు మొదలైన అంశాలపై ఈ బృందం దృష్టిసారించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా, డిఆర్డీఏ, హౌసింగ్ పీడీలు నర్సయ్య, విజయ ప్రసాద్, వెంకట నారాయణ, డిపివో సమత తదితరులు పాల్గొన్నారు.

## హార్ట్ స్ట్రోక్ తో హెూంగార్డు మృతి...

- సంతాపం తెలియజేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూలై 24:** అనంతపురం జిల్లా పోలీస్ ఏ.ఆర్ విభాగంలో పనిచేస్తున్న హెూంగార్డు పెద్దన్న ఈరోజు ఉదయం గుండెపోటుతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక అంబేద్కర్ నగర్ లో ఉంచిన మృతదేహాన్ని ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ రాముడు, ఆర్ ఎస్ ఐ జాఫర్ లు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు.

## సర్ అర్థర్ కాటన్ దొర వర్ధంతి సందర్బంగా వారి విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 24:** అనపర్తి మండలం రామవరంలో ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన దర్శనికుడు, అపర భగీరథుడు సర్ అర్థర్ కాటన్ దొర వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి నివాళులర్పించిన వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మరికొందరు బిజెపి ముఖ్యనేతలు వున్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల, రామవరం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ని వీడి టీడీపీ లో చేరిన అద్దంకివారిలంక జగజ్జీవన్ నగర్ వైసీపీ కార్యకర్తలు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 24:** కపిలేశ్వరపురం మండలం, అద్దంకివారిలంక జగజ్జీవన్ నగర్ కు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ గ్రామ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు గాలిదేవర వసంతరాయుడు ఆధ్వర్యంలో మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మల్లిపూడి లక్ష్మణరావు, మల్లిపూడి సత్యనారాయణ, మల్లిపూడి ఏడుకొండలు, మల్లిపూడి ఏసు, మల్లిపూడి ఆనందరావు, మల్లిపూడి చిన అర్జున్న, మల్లిపూడి గంగయ్య, మల్లిపూడి జార్జి, మల్లిపూడి చిన ఏడుకొండలు ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, కపిలేశ్వరపురం మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, మాజీ అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, జుత్తుక చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కేకేసి ఏపీ స్టేట్ సెక్రటరీ ఎంఎండి ఇమామ్ కు ధర్మవరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఘన సన్మానం....

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘన సన్మానం పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువ....



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ కేకేసి రాష్ట్ర సెక్రటరీ గా సత్యసాయి జిల్లా కర్నూలు జిల్లా నంద్యాల జిల్లా మూడు జిల్లాల కేకేసి ఇన్చార్జిగా నియమింప బడినందుకు ఎంఎండి ఇమామ్ కు ధర్మవరం పట్టణానికి చెందిన బీసీ ఎస్సీ ఎస్టీ దళిత మైనార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి పుష్పగుచ్చాలతో శాలువలతో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనే ఇమామ్ గారికి మూడు జిల్లాల కేకేసి పదవి రావడం తమకు చాలా ఆనందంగా ఉందని భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కార్మికుల కర్షకుల సమస్యలు పై ముందుండి సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో కేకేసి ఏపీ రాష్ట్ర సెక్రెటరీ ఎంఎండి ఇమామ్ మాట్లాడుతూ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తన మీద నమ్మకంతో సత్యసాయి కర్నూల్ నంద్యాల జిల్లా కేకేసి ఇన్చార్జిగా నియమించడం తనకు చాలా ఆనందంగా ఉందని కార్మికుల కర్షకుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తానని త్వరలోనే మూడు జిల్లాల వ్యాప్తంగా కూడా పర్యటించి స్థానిక సమస్యలపై పరిష్కరించే విధంగా ప్రణాళిక రూపొందిస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ దళిత మైనార్టీ నాయకులు ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ నాయకులు ఫారుక్ ముల్ల, కలీం,ఇస్మాయిల్, అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.....

# సోలార్ రూఫ్ టాప్ నిర్మాణంలో మనం ఆదర్శంగా నిలుద్దాం





- మూడు మండలాల ప్రజలకు ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ పిలుపు
- ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం
- కార్యక్రమంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, ఎస్ఈ సంపత్ కుమార్

**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 24:** ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవడంలో రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం, సోలార్ రూఫ్ టాప్ నిర్మాణంపై చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గేట్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో నిర్వహించిన ఈ సదస్సులో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, విద్యుత్ శాఖ ఎస్.ఈ సంపత్ కుమార్, ఇతర అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంకుల ప్రతినిధులు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అందించే సోలార్ ఎలా ఉంటుందన్న దానిపై ఇక్కడ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇది ఎలా పని చేస్తుంది.. ఎంత ఖర్చు చేయాలి, ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, దీని వలన కలిగే లబ్ధి వంటి అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గం నుంచే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఏ పని మొదలు పెట్టినా అది విజయవంతమవుతుందన్నారు. గతంలో సోరాల్ ప్యానల్స్ చూసి దీని నుంచి కరెంట్ ఎలా వస్తుందని ఆశ్చర్యపోయే వారని.. కానీ ఈ రోజు అన్ని ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నాయన్నారు. వ్యవసాయ భూముల్లో సోలార్ ప్రాజెక్టులు మాత్రమే ఇప్పటి వరకు చూశారని.. కానీ ఇప్పుడు మన ఇంటిపై వీటిని ఏర్పాటు చేయవచ్చన్నారు. మన ఇంటికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వాలకు విక్రయించవచ్చన్నారు. దీని ద్వారా విద్యుత్ బిల్లులను పూర్తిగా ఆదా చేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి టెక్నాలజీని ప్రతి నిత్యం ప్రోత్సహిస్తుంటారన్నారు. ఆయన రాజకీయ ప్రసంగాలతో పాటు ప్రజలకు మేలు చేకూరేలా ఒక ఇంటి పెద్దలాగా సూచనలు చేస్తుంటారన్నారు. అందులో నిగూడంగా మనకు ప్రయోజనాలు కల్గించే సూచనలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీతో ఇచ్చే పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా మరింత రాయితీ ఇస్తోందంటే.. ఇది ఎంత ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పై వీటిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు మరికొందర్ని ఆ దిశగా ప్రోత్సహించాలని శ్రీరామ్ సూచించారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాలో ముందు ఈ కార్యక్రమాన్ని మా నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తున్నామన్నారు. ఇక్కడి ప్రజలకు ఉపయోగపడే ఏ విషయంలోనైనా తాము ముందుంటామన్నారు. గతంలో విద్యుత్ బిల్లులు అధికంగా పెంచడం వలన ఎవరైనా చిన్న లైట్ వేసుకోవాలంటేనే బిల్లులకు భయపడే పరిస్థితి ఉండేదన్నారు. అందుకే ప్రధానమంత్రి మోదీ ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. సామాన్య ప్రజలకు విద్యుత్ భారం లేకుండా చూసే విధంగా ఇంటి పైన సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందులో 60వేల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకైతే పూర్తి ఉచితంగా ఉంటుందన్నారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 20వేల వరకు సబ్సిడీ ఇస్తోందన్నారు. దీనిపై ప్రజలకు అనేక సందేహాలు, అనుమానాలు ఉన్నాయని.. వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు వీటి గురించి వివరించాలన్నారు. ఏ ఇంటిపై ఎంత మేర సోలార్ ఏర్పాటు చేసుకోవచ్చు.. దానికయ్యే ఖర్చు ఎంత.. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఎంత.. బ్యాంకర్లు ఎంత రుణం ఇస్తారు.. విద్యుత్ బిల్లు ఎంత ఆదాఅవుతుందన్నది వారికి తెలియజేయాలన్నారు. రుణాల విషయంలో బ్యాంకర్లు పాత వాటి గురించి ప్రస్తావన తీసుకురావదన్నారు. ఇక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పని చేస్తే.. వందశాతం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవచ్చని ఎమ్మెల్యే సునీత అన్నారు...

# ఏపీలో పిఎం విశ్వకర్మ పథకం కింద 2.22 లక్షల మంది నమోదు.

- కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే వెల్లడి
- ఎంపీ కేశినేని శివనాథ్ ఎంపి బస్తిపాటి నాగరాజు అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం



**అంకుశం ప్రతినిధి అమరావతి జూలై 24:** చేతిపనులు చేసే సంప్రదాయ వృత్తులకు చెందిన కళాకారులు, చేతివృత్తులవారు ఆర్థికంగా స్వయం సమృద్ధులు కావాలని లక్ష్యంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం 17.09.2023 న ప్రారంభించబడింది. ఇది కేంద్ర విభాగానికి చెందిన పథకం కావడం వల్ల రాష్ట్రాలు, జిల్లాల వారీగా నిధులు కేటాయించడం లేదని లోక్ సభలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపి బస్తిపాటి నాగరాజు లు కలిపి అడిగిన ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపి బస్తిపాటి నాగరాజు లు కలిసి ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం అమలు, నిర్వహణ, ఇతర వివరాలపై ప్రశ్నించారు.ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు 21.63 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2.22 లక్షల మంది విజయవంతంగా నమోదు అయ్యారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే వెల్లడించారు. బ్లాక్స్మిత్‌లు (లొహార్), గోల్డ్స్మిత్‌లు (సునార్), మేజన్‌లు (Raj Mistri) వంటి వృత్తులపై ప్రత్యేక లక్ష్యాలను ఏ శిక్షణ సంస్థకీ కేటాయించలేదు. అయినా, పథకంలో నమోదు అయిన ప్రతి లబ్ధిదారుడికి ప్రాథమిక నైపుణ్య శిక్షణ ఇవ్వాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ పథకానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనేక శిక్షణ కేంద్రాలు వేలాదిమందికి ప్రాథమిక నైపుణ్య శిక్షణను అందిస్తున్నాయన్నారు. ఏ శిక్షణ సంస్థకి లక్ష్యాలను కేటాయించలేదని, అయితే ఆ సంస్థలు ఈ పథకంలో నమోదు అయిన ప్రతి లబ్ధిదారుడికి ప్రాథమిక నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ముఖ్యంగా బంగారు కార్మికులు, కొలిమికార్మికులు( blacksmiths) , తాపీ మేస్త్రీలు (masons) వంటి సంప్రదాయ వృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్టిఆర్ జిల్లాలో కూడా ప్రత్యేక శిక్షణ కేంద్రాల ద్వారా వివిధ వృత్తులపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లండించారు.. విజయవాడ, మైలవరం, నందిగామ, జి.కొండూరు వంటి ప్రాంతాల్లోని శిక్షణ కేంద్రాల్లో బంగారు కార్మికులు, కొలిమి కార్మికులు ( blacksmiths) , తాపీ మేస్త్రీలు (masons) శిక్షణ అందిస్తున్నారని వివరించారు.ఎన్టీఆర్ జిల్లాలో బంగారు కార్మికులు (Goldsmith) 78 మంది , కొలిమి కార్మికులు( blacksmiths) 16 మంది , తాపీ మేస్త్రీలు (masons) 19 మంది శిక్షణ పొందిన వారిలో వున్నారన్నారు. ఈ పథకం ద్వారా సంప్రదాయ కళల పరిరక్షణతో పాటు, ఆ వృత్తులకు ఆధునిక శిక్షణ, సాధనాలు, ఆర్థిక మద్దతుతో పాటు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే స్పష్టం చేశారు.

# చంద్రబాబు మోసాలు జనంకు అర్థమైంది

- అనంతలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'
- వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి





**అంకుశం న్యూస్ అనంతపురం, జూలై 24 :**చంద్రబాబు మోసాలు ప్రజలకు అర్థమైందని జనం గ్రహించారని ఎక్కడికి వెళ్లినా జనం ఇదే మాట చెబుతున్నారని కూటమి అరాచకాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. అనంతపురంలోని 8వ డివిజన్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కూటమి మేనిఫెస్టోను వివరిస్తూ ఏడాదిగా ప్రజలకు ఎంత మేరకు నష్టం జరిగిందో క్యూ ఆర్ కోడ్ సాయంతో వివరించిన అనంత, వైసీపీ నేతలుసూపర్ సిక్స్ హామీలతో తమను మోసం చేశారని అనంతతో వాపోయిన మహిళలు ఆడబిడ్డ నిధి, ఫ్రీ బస్సు, 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగ భృతి అంటూ మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని ఆవేదన ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేయడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్న స్థానికులు వైఎస్ జగన్ పాలనలోనే తమకు సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేసిన మహిళలు, వృద్ధులు

అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ...చంద్రబాబు ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన అందించామని కూటమి నేతలు చెబుతూ ప్రజల వద్దకు వెళు తున్నారు. ఇదే సమయంలో మేం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం చేపట్టాం. అనంతపురం జిల్లా అంతటా 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం జరుగుతోంది. ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ.1500 అందిస్తామని చెప్పినా ఈ రోజుకీ ఒక్క రూపాయి అందించలేదు. అని జనం చెప్తున్నారని వెంకట్రాం రెడ్డి అన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఇంటి వద్దకే రేషన్ అందేది. కానీ నేడు సుదూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు అని అనంత వెంకట్రాంరెడ్డి ఆరోపించారు.వైఎస్ఆర్ చేయూత కింద గతంలో ఏటా రూ.18750 అందేదని, కానీ చంద్రబాబు వచ్చాక అందడం లేదని మహిళలు అంటున్నారు అని అనంత వెంకట్రాం రెడ్డి అన్నారు.

## ఘనంగా మహిళా శక్తి సమావేశం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 24:** 23 వ ప్రాతినిధ్య వార్షిక మహాసభ రామగిరి మండలం మహిళాశక్తి సొసైటీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 23 వ వార్షిక మహాసభ 24 వ అధ్యక్షురాలు సుబ్బమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మహాసభ కు సంఘం ప్రతినిధులు హాజరు అయినారు .2024-2025 సంవత్సరం వార్షిక నివేదిక,లెక్కచారాలు మరియు ఆడిటర్ నివేదిక,ఆడిటర్ నియామకం మరియు పాలకవర్గం చేర్పులు మార్పులు గురించి ఆమోదించడం జరిగింది. వీటితోపాటు లబ్ధిదారులు అభిప్రాయాలను పంచుకున్నారు.ముఖ్య అతిథులు గా టీంబక్ట్ కలెక్టివ్ వ్యవస్థాపకులు మేరీ వట్టమట్టం,శ్రీ c. k. బబ్లూ గంగూలి గారు,మనీషా కైరాల గారు , E. D. సుకన్య గారు ఇతర టీంబక్ట్ కలెక్టివ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది,అలాగే సొసైటీ సిబ్బంది,పాలకవర్గం పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు తుంగ లో తొక్కారు-ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై24:** చంద్రబాబు ఎన్నికల హామీలు తుంగ లో తొక్కారని మండపేట నియోజకవర్గం వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరం మండలంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు, జనసేన నేత పవన్ కళ్యాణ్‌లు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని తోట త్రిమూర్తులు విమర్శించారు. చంద్రబాబు హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు యాత్రలు వంటి పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను గాలిలో మేడలు కట్టి మోసం చేశారని ఆయన విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు బాండ్ల రూపంలో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి వెళ్లి కూటమి ప్రభుత్వం హామీలను ఎలా అమలు చేయలేదో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గతంలో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను వివరించిందని, అదే విధంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైఫల్యాలను బహిర్గతం చేయాలని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్‌ను ఆపేసి, 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంచుతోందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తప్పుడు కేసులు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. 2014లో రుణమాఫీ హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో మోసాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేస్తారని, ఆయన హామీలు నిజాయితీగా ఉంటాయని తోట గుర్తు చేశారు. అధికారులు వైఎస్ఆర్సీపీ ప్రజాప్రతినిధులతో సహకరించకుండా కూటమి ప్రభుత్వం కనుసన్నల్లో పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేకించాలని ఆయన అన్నారు.నిజయోకవర్గ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అయితే చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడంలో గిన్నిస్ బుక్ రికార్డు స్థాయిలో ఉన్నారని విమర్శించారు. పటిష్టమైన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, క్యూ అర్ కోడ్ ద్వారా కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోన రీకాల్ చేసి, బాబు చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. మండల వైసిపి కన్వీనర్ వెలగల సత్యనారాయణ రెడ్డి రాష్ట్ర వైసిపి కార్యదర్శి కర్రి పాపారాయుడు ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ కర్రి విజేత, వైస్ ఎంపీపీ శ్రీను, సత్తి వెంకట రెడ్డి, చింతా సుబ్బారెడ్డి, పసలపూడి సర్పంచ్ కదలి పద్మావతి, చంద్రమల్ల రామకృష్ణ, అప్పారావు, వాసంసెట్టి వెంకటరావు (చిన్నా), ఆరిఫ్, సిరిపురం శ్రీను, పాలిక గోవిందు, పాలిక శ్రీను, ఎంపిటిసి పలివెల వెంకట ఆది లక్ష్మి, వైట్ల దొరయ్య, చిక్కాల శ్రీరాములు, పోతం శెట్టి సత్తిబాబు , బుద్ధాల రామకృష్ణ, మేడిశెట్టి దుర్గారావు, పలివెల మధు, సాధనాల శివ, యారామాటి వెంకన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా సర్ ఆర్డర్ కాటన్ వర్ధంతి

- కాటన్ దొర డెల్టా ప్రజలకు కల్పించిన దైవం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 24:** వైఎస్సార్సీపీ తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి పాల్గొని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ ఇంజనీర్‌గా ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించిన కాటన్ దొర గోదావరి జిల్లాల చరిత్రను మారుస్తూ, సాగునీటి విప్లవానికి నాంది పలికారు. అప్పటిదాకా కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చిన మహనీయుడు. ఆయన చేసిన సేవలు మరువలేనివి. ప్రజల హృదయాల్లో దేవుడిగా కొలువై ఉన్న కాటన్ దొరను ప్రతి సంవత్సరం స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు కర్రి రామచంద్రారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి పద్మావతి, పార్టీ నాయకులు కర్రి గాంధీరెడ్డి, అప్పారావు, కర్రి గోపాలరెడ్డి, నల్లమిల్లి అచ్చిరెడ్డి, టేకి రాఘవ, కొవ్వూరి ఆదిరెడ్డి, నల్లమిల్లి ఆదినారాయణ రెడ్డి (బాబ్జి), చింతా ప్రభాకరరెడ్డి, పులగం శివారెడ్డి, తమలంపూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 126 వ వర్ధంతి వేడుకలు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 24:** విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 126 వ వర్ధంతినీ ఘనంగా నిర్వహించినట్లు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు తెలిపారు. గురువారం ఆయన మండపేట లో మీడియాతో మాట్లాడుతూ కాటన్ దొర చిత్ర పటానికి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారన్నారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ భూమి, ఆకాశం ఉన్నంత వరకు కాటన్ మహాశయుణ్ణి ఇక్కడ ప్రజలు మరచిపోలేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు నా యకులు సింగం రామకృష్ణారెడ్డి,నరహరిశెట్టి నరసింహారావు, కె.శివాజీ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.